క్లుప్తంగా

ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం



దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఆదేశాలతో జిల్లాకేంద్రంలోని వివేకానంద చౌక్‌లో పట్టణ కాంగ్రెస్ కార్యకర్తలు సోమవారం బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. నిర్మల్‌లో ఇటీవల నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ఆరంభంలో రాష్ట్ర గీతాన్ని అవమానించడం, సీఎం రేవంత్‌రెడ్డి అసభ్య పదజాలంతో దూషించినందుకు ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం చేసినట్లు నాయకులు తెలిపారు. రాష్ట్ర గీతాన్ని అవమానించిన ఎమ్మెల్యే భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, ఆత్మ డైరెక్టర్ రామ్‌రెడ్డి, యువజన జిల్లా అధ్యక్షుడు సమరసింహారెడ్డి, దేవరకోట ఆలయ చైర్మన్ కొండ శ్రీనివాస్, సాయిబాబా ఆలయ చైర్మన్ బూరాజ్, నిర్మల్ మండల అధ్యక్షులు కుంట వేణుగోపాల్, హజార్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ మండల కార్యవర్గం



కార్యవర్గ సభ్యులతో శ్రీనివాస్ యాదవ్

కడెం: మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ మండల కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు రెంకల శ్రీనివాస్‌యాదవ్ తెలిపాప రు. ప్రధాన కార్యదర్శిగా బెడద అంజివర్మ, ఉపాధ్యక్షులుగా తరి గంగాధర్, మోరపాక రాజు, అజ్మీరా చందు, కార్యదర్శులుగా గోపాల్, ఆశోక్ ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, నియోజవర్గ అధ్యక్షుడు రాహుల్ ఆదేశాల మేరకు ఎన్నుకున్నట్లు శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఇందులో కార్యకర్తలు మహేశ్, నవీన్, ప్రేమ్ సింగ్, రాజు తదితరులు ఉన్నారు.

భక్తులకు కీ చైన్‌ల పంపిణీ



కీ చైన్‌లు అందజేస్తున్న డీఎం హరిప్రసాద్

కుంటాల: మండలంలోని లింబా(బి) నుంచి తీర్థయాత్రలకు వెళ్తున్న భక్తులకు భైంసా డీఎం హరిప్రసాద్ సోమవారం కీ చైన్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీ చైన్ పైన స్కాన్ మీ అని రాసి ఉంటుందన్నారు. దాన్ని ఓపెన్ చేయగానే ఆర్టీసీ ప్రవేశపెడుతున్న పథకాలు, బస్సుల వివరాలు ప్రయాణికులకు కనిపిస్తాయన్నారు. సీఐ భారతి, హెడ్ కానిస్టేబుల్ భగవంత్ రావు, వీబీఓలు సుధాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం కప్పతల్లి ఆట



కప్ప తల్లితో ఆటలు ఆడుతున్న చిన్నారులు

ఖానాపూర్: పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో సోమవారం చిన్నారులు కప్పతల్లి ఆట ఆడారు. రోకలికి కప్పను కట్టి డప్పుచప్పుళ్ల మధ్య కాలనీలో ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా కప్పతల్లికి పూజలు చేయడంతోపాటు నీరుపోసి వానలు కురవాలని మొక్కు కున్నారు.

'హెచ్‌సీఏను నమ్మి మోసపోవద్దు'

నిర్మల్‌టౌన్: జిల్లా ప్రజలు, క్రీడాకారులు చట్టబద్ధతలేని హెచ్‌సీఏ చేస్తున్న ప్రయత్నాలను నమ్మి మోసపోవద్దని టీసీఏ జిల్లా కోచ్ రామరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు చేయని అభివృద్ధి ఇప్పుడు చేస్తామంటూ హెచ్‌సీఏ చేస్తున్న ప్రయత్నాలు నమ్మవద్దని తెలిపారు. ఈ విషయమై హైకోర్టు..జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధి హెచ్‌సీఏతో సాధ్యం కాదని, బీసీసీఐకి టీసీఏతో కలిసి పనిచేయాలని ఆదేశించింది. దీన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు.

ఘనంగా మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు

కడెం: మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రెంకల శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు అంజి, గంగాధర్, రాజు, చందు, మహేశ్, నవీన్ ఉన్నారు.

ప్రాణాలు పోతున్నా.. పట్టదా!

కుభీర్‌కు చెందిన దొంతులవార్ గణేశ్ అనే రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి కూతురు నిఖిల హైదరాబాద్‌లో చదువుతోంది. ఇటీవల సెలవుల్లో ఇంటికి రాగా, తిరిగి పంపేందుకు బాసర నుంచి రైలులో హైదరాబాద్ వెళ్లాలనుకున్నారు. ఈమేరకు కుభీర్ నుంచి బైక్‌పై బయల్దేరి వస్తున్న క్రమంలో భైంసా మండలంలోని దేగాం వద్దకు రాగానే, వంతెన వద్ద బైక్ అదుపుతప్పి పైనుంచి కిందపడ్డారు. ఈ ఘటనలో తండ్రి గణేశ్ అక్కడే మృతిచెందగా, కూతురు నిఖిల కాలు విరగగా, నడుముకు తీవ్ర గాయాలయ్యాయి.



చికిత్స పొందుతున్న నిఖిల

ప్రస్తుతం ఆమె భైంసాలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వంతెన వద్ద 161 బిబి హైవే పనులు జరుగుతున్న ప్రదేశంలో వాహనదారులను హెచ్చరించేలా 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్'అని బోర్డులు ఏర్పాటు చేయలేదు. కానీ, హైవే వెంబడి రోడ్డు పనులు



మృతి చెందిన గణేశ్

జరుగుతున్న చాలాచోట్ల ఇలాంటివి కనిపించడం లేదు. ఇదొక్కటే కాకుండా హైవే పనుల్లో నిర్లక్ష్యం కారణంగా ఎంతో మంది గాయాల పాలవుతుండగా, కొందరు ప్రాణాలు కోల్పోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



దేగాం వంతెన వద్ద ఎలాంటి ప్రమాద హెచ్చరిక ఏర్పాట్లు లేని దృశ్యం

- 161బిబి హైవే పనుల్లో నిర్లక్ష్యం
- నిత్యం ఏదో ఓ చోట ప్రమాదం
- అధికారుల పర్యవేక్షణ శూన్యం

భైంసాటౌన్: జిల్లా సరిహద్దులోని బాసర–భైంసా మార్గంలో చేపడుతున్న 161 బిబి జాతీయ రహదారి విస్తరణ పనుల్లో చిన్నపాటి నిర్లక్ష్యాల కారణంగా నిండు ప్రాణాలు బలవుతున్నాయి. మరెంతో మందిని క్షతగాత్రులుగా మిగులుస్తున్నాయి. రహదారి పనులు జరుగుతున్న చోట్ల వాహనదారులను అప్రమత్తం చేసేలా కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడంతో, నిత్యం రహదారిపై ఎక్కడో ఓ చోట వాహనదారులు ప్రమాదాలబారిన పడుతూనే ఉన్నారు. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు ఎంతోమంది గాయాలపాలు కాగా, కొందరు మృత్యువాత పడిన సందర్భాలున్నాయి. ఈ విషయమై 'సాక్షి'పలుమార్లు కథనాలు ప్రచురించింది. అయినా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రాణాలు పోతున్నా పట్టదా అని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పదుల సంఖ్యలో ప్రాణాలు హరీ..!

బోధన్ నుంచి భైంసా వరకు రోడ్డు విస్తరణలో భాగంగా 161 బిబి హైవే పనులు చేపడుతున్నారు. దాదాపు మూడేళ్లు కావస్తున్నా.. ఇంకా చాలాచోట్ల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. దేగాం, తరోడ, ముధోల్ నుంచి బాసర వరకు పలుచోట్ల పనులు పూర్తి కాలేదు. దేగాం వద్ద వంతెన పనులు జరుగుతున్నాయి. ఇంకా కొన్నిచోట్ల చిన్నపాటి పనులు చేపడుతున్నారు. అయితే, పనులు జరుగుతున్న చోట వాహనదారులను హెచ్చరించేలా, ప్రమాదాలు జరగకుండా అప్రమత్తం చేసేలా ఎలాంటి జాగ్రత్త చర్యలు కనిపించడం లేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండగా, పట్టించుకోవాల్సిన అధికారులు పర్యవేక్షణ చేసిన దాఖలాలు కనిపించడం లేదు. ఫలితంగా తరచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. హైవే పనులు ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు పదుల సంఖ్యలో వాహనదారులు ప్రాణాలు కోల్పోగా, ఎంతోమంది గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు.

చర్యలు తీసుకుంటాం

భైంసా–బాసర మార్గంలో 161 బిబి హైవేపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు దృష్టికి వచ్చింది. రోడ్డు పనులు జరుగుతున్న ప్రాంతాల్లో వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా చర్యలు తీసుకుంటాం. సూచికబోర్డులు ఏర్పాటు చేసేలా కాంట్రాక్టర్‌కు సూచిస్తాం. పనులపై నిరంతర పర్యవేక్షణ చేస్తాం.

– నరేశ్, హైవే డీఈఈ, నిర్మల్

దత్తాత్రేయ ఆలయ పనులు ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసారూరల్: మండలంలోని చింతల్‌బోరి గ్రామంలో ఎమ్మెల్యే రామారావు పటేల్ సోమవారం దత్తాత్రేయ ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.50లక్షల సీజీఎఫ్ నిధులతో నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. తన హయాంలో ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. దశలవారీగా గ్రామ అభివృద్ధికి పాటుపడతానన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, బీజేపీ మండల అధ్యక్షురాలు సుష్మారెడ్డి, నాయకులు అబ్దుల్ రజాక్, రాంకిషన్ పటేల్, పండిత్ పటేల్, గామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుడి బోధనలు అనుసరణీయం

- అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటస్వామి



బుద్ధుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

సారంగపూర్: బుద్ధుడి సూచించిన శాంతిమార్గం, బోధనలు అనుసరణీయమని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంటోల్ల వెంకటస్వామి అన్నారు. మండలంలోని బీరవెల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన బుద్ధుడి విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్ధుడు ప్రపంచానికి శాంతి మార్గాన్ని సూచించారని అన్నారు. నేటి యువత ఆయన సూచించిన మార్గంలో నడవాలని కోరారు. ఆయన చివరిరోజుల్లో బౌద్ధమతాన్ని స్వీకరించారని తెలిపారు. అంతటి మహానుభావుడి విగ్రహాన్ని గ్రామంలో ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం గ్రామస్తులను అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎల్లన్న, చిన్నయ్య, రాజేశ్వర్, ప్రేమనందం, మురళి, గంగాధర్, ఎర్రన్న, రాజు, మారుతి, సాయి, నర్సయ్య, మహిళలు పాల్గొన్నారు.

జాతి, వైరం మరచి.. స్నేహం



ఖానాపూర్: జాతి, వైరం మరిచి కుక్కతో పిల్లి స్నేహ హస్తం సాచింది. సహజంగా ఈ రెండు శత్రుత్వాన్ని చూపుతాయి. కాని జాతి వైరం మరిచి అవి రెండు ఒకదానికొకటి స్నేహం చేస్తూ కలిసి మెలిసి అన్యోన్యంగా ఉంది. మండలంలోని కొలాంగూడ గ్రామంలో ఆదివాసీల నివాసాల్లో ఉండే పెంపుడు కుక్కతో పిల్లి కరచాలనం చేసింది.

అ'పూర్వ' సమ్మేళనం



సారంగపూర్: మండలంలోని బీరవెల్లి గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో 1991-92 బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థులు సోమవారం కలుసుకున్నారు. వీరి అపూర్వ సమ్మేళనానికి పాఠశాల వేదికైంది. ఎక్కడెక్కడో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదిలో గడిపిన మధుర స్మృతులను గుర్తుచేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

'పిల్లల భవిష్యత్తులో తల్లిదండ్రుల పాత్ర కీలకం'

నిర్మల్‌ఖిల్లా: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర తల్లిదండ్రులదేనని ప్రముఖ సైకాలజిస్టు అడ్డిగ శ్రీనివాస్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో విజయ ఉన్నతపాఠశాల ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో 'పిల్లల భవిత తల్లిదండ్రుల బాధ్యత'అనే అంశంపై పోషకులకు దిశానిర్దేశం చేశారు. విద్యాభ్యాసంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, అధిక ఒత్తిడిని ఎలా అధిగమించాలి, తల్లిదండ్రులు పిల్లల ఆలోచన దృక్పథానికి ఎలా స్పందించాలి, వారితో ఎలా మెలగాలో వివరించారు. వివిధ సందేహాలను నివృత్తి చేశారు. లక్ష్యాలు చేరుకునే క్రమంలో ప్రణాళికల అమలు తీరును వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ చైర్మన్ అయ్యన్నగారి భూమయ్య, విద్యావేత్తలు అంబారాణి, ఆడేపు సుధాకర్, ఆమెడ కిషన్, మంచిరాల నాగభూషణం, సామ మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సైకాలజిస్టు శ్రీనివాస్

భైంసా, పెంబిలో భారీ వర్షం

భైంసాటౌన్/పెంబి: భైంసాలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దాదాపు అరగంటకు పైగా జోరువాన పడడంతో కూరగాయల మార్కెట్, ఫిష్ మార్కెట్, వివేకానంద చౌరస్తా, తదితర ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. సోమవారం వారసంత కావడంతో ఎగువ నుంచి వాననీటితో కూరగాయల విక్రయదారులు ఇబ్బందులు పడ్డారు. ఇక, చాలారోజుల తర్వాత జోరువాన పడడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పత్తి, సోయా పంటలకు మేలు చేస్తుందని చెబుతున్నారు. అదేవిధంగా పెంబి మండల కేంద్రంతోపాటు మందపల్లి, తదితర గ్రామాల్లో కురిసిన భారీ వర్షం ఎండుతున్న పంటలకు జీవం పోసింది. వాన కురవడంతో రైతుల ముఖంలో ఆనందం వెల్లివిరిసింది.

పంటలకు ఊరట..



ఫిష్ మార్కెట్ వద్ద రోడ్డుపై పారుతున్న వాన నీరు

లోకేశ్వరం: మండలంలోని అన్ని గ్రామాల్లో కురిసిన వర్షానికి సోయా, పత్తి, వరి, మొక్కజొన్న పంటలకు ఊరటనిచ్చింది. వారం రోజులుగా వానలు లేకపోవడంతో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు వాడిపోయో దశకు చేరుకున్నాయి. సోమవారం సాయంత్రం వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దారులన్నీ ఇరుకుగానే..



ఖానాపూర్ టు తర్లపాడ్ మార్గంలో ఆటో ఎదురుగా రావడంతో ఆగిన బస్సు

- దశాబ్దాలుగా సింగిల్‌రోడ్డే దిక్కు
- ప్రమాదకరంగా మూలమలుపు, కల్వర్టులు
- వాహనదారులకు తప్పని ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు



సింగాపూర్ వద్ద ప్రమాదకర మూలమలుపు

ఖానాపూర్: ఖానాపూర్, కడెం, పెంబి తదితర మండలాల్లోని మారుమూల గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులన్నీ ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. 20 కి.మీ పైచిలుకు ఉన్న ఖానాపూర్ టు పెంబి, ఖానాపూర్ టు బెల్లాల్‌తోపాటు 20 కి.మీ దూరంలో ఉన్న ఖానాపూర్ టు రాజూరా రోడ్డు, ఖానాపూర్ టు ఎర్వచింతల్ తదితర రోడ్లన్నీ ఇరుకుగానే ఉన్నాయి. అనేక చోట్ల మూలమలపులు, కల్వర్టులు ప్రమాదకరంగా ఉన్నాయి. పేరుకే ఆర్అండ్‌బీ రోడ్లుగా కొనసాగుతున్న వీటి దుస్థితి దశాబ్దాలుగా మారడం లేదు. అసలే ఇరుకుగా ఉన్న ఈ రోడ్లకు ఇరువైపులా దట్టమైన అటవీ ప్రాంతం ఉంది. తరచూ జంతువులు రోడ్డు దాటుతూ ఉంటాయి. దీంతో వాహనదారులు అరచేతిలో ప్రాణాలతో వెళ్తున్నారు.

సింగిల్‌రోడ్డు దుస్థితి

దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన సింగిల్ రోడ్డే దిక్కయింది. ఓ వైపు నుంచి బస్సు లేదా లారీ వచ్చినా ఇతర వాహనదారులు రోడ్డు దిగి వాహనం నిలిపి దారి ఇవ్వాల్సిన దుస్థితి నెలకొంది. గత కొన్నేళ్లుగా పెంబితోపాటు మండలంలోని ఎర్వచింతల్, రాజూరా తదితర చోట్ల నుంచి ప్రభుత్వం ఇసుకకు అనుమతి ఇచ్చింది. ఇసుకతోపాటు హైవే పనులకు మొరం తరలించేందుకు అనుమతి లభించింది. దీంతో సింగిల్ రోడ్డుపై కాంట్రాక్టర్లు భారీ టిప్పర్లు వినియోగించారు. ప్రతీరోజు పదుల సంఖ్యలో టిప్పర్లు వెళ్లడంతో వాహనదారులు నరకం అనుభవించారు. వీటన్నింటికి తోడు వర్షాల కారణంగా రోడ్డు పక్కనే ఉండే సైడ్‌బర్మ్ (మట్టి) కొట్టుకుపోయింది. వీటితోపాటు రోడ్లపైకి అడ్డంగా వంగి ఉన్న చెట్లు ఎప్పుడు కూలుతాయో తెలియని దుస్థితి నెలకొంది. గతంలో చెట్లు కూలి పలువురు మృతిచెందగా, పలువురు గాయపడ్డ సందర్భాలు ఉన్నాయి. ఈ విషయమై గ్రామాల ప్రజలు, వీడీసీలు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే వారు కరువయ్యారు. రోడ్ల విస్తరణ చేస్తామన్న పాలకుల హామీలు నేటికి అమలు కావడంలేదు. కనీసం ప్రమాదం జరిగిన చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

ప్రమాదాలు జరిగిందిలా..

గతంలో ఖానాపూర్ మండలం సత్తన్‌పల్లి శివారులో మూలమలుపు వద్ద రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు మృతి చెందారు. మూడు నెలల క్రితం పెంబి శివారులో ఒకరు మృతి చెందారు. తర్లపాడ్ దారిలోని ఇండెన్‌గ్యాస్ మూలమలుపు వద్ద, దిలావార్‌పూర్, సింగాపూర్, ఎర్వచింతల్ మూలమలుపుల వద్ద పలువురు మృతి చెందడంతో పాటు గాయాల పాలయ్యారు. గతకొన్ని రోజుల క్రితం పెంబి వెళ్లే దారిలో ప్రైవేటు పాఠశాల బస్సు చెట్టును ఢీకొని విద్యార్థులకు గాయాలయ్యాయి. దీంతో పెను ప్రమాదం తప్పింది.

పట్టించుకోవడం లేదు



ఖానాపూర్ టు పెంబి మార్గం పూర్తిగా ఇరుకుగా మారింది. గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. 15 రోజుల క్రితం నాగాపూర్ వద్ద ప్రైవేటు పాఠశాల బస్సు చెట్టును ఢీకొట్టింది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

– సాయిలు, నాగాపూర్

సాగులో డ్రోన్ టెక్నాలజీ

తానూరు: వ్యవసాయంలోనూ డ్రోన్ టెక్నాలజీ పెరిగింది. గతంలో రైతులు పంప్ స్ప్రేలు భుజాన వేసుకుని గంటల తరపడి పంటలకు స్ప్రే చేసేవారు. గతంలో పట్టణాల్లోనే ఉన్న డ్రోన్ టెక్నాలజీ ప్రస్తుతం పల్లెలకూ చేరింది. పంటలకు పురుగులు, ఎరువుల మందు చల్లేందుకు డ్రోన్ స్ప్రే వాడకం పెరిగిపోయింది. మండలంలోని దాగాం శివారు ప్రాంతంలో రైతు గంగాధర్ పొలంలో డ్రోన్‌తో స్ప్రే చేస్తున్న దృశ్యమిది. ఎకరాకు రూ.400 తీసుకుంటున్నట్లు నిర్వాహకుడు తెలిపారు. ఇది గంటకు రెండు నుంచి మూడెకరాల్లో డ్రోన్ స్ప్రే చేస్తోందని పేర్కొన్నాడు. దీంతో సమయం వృథాకావడం లేదని రైతు తెలిపాడు.



డ్రోన్ సాయంతో పంటకు మందులు వేస్తూ..

విద్యార్థినికి సన్మానం

నిర్మల్‌ఖిల్లా: జేఈఈ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన జిల్లాకేంద్రానికి చెందిన సహనను ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఆదివారం రాత్రి సన్మానించారు. పట్టణంలోని సాధుసారిక-రామ్‌రెడ్డి దంపతుల పెద్దకుమార్తె 'సహన'మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఐఐటీ ఇండోర్‌లో కంప్యూటర్ సైన్స్ విభాగంలో సీటు సాధించింది. ఈనేపథ్యంలో నిర్మల్ పర్యటనకు విచ్చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి విద్యార్థినితోపాటు తల్లిదండ్రులను కలిసి సన్మానించారు. ఉన్నత విద్యనభ్యసించి జీవితంలో అత్యుత్తమంగా ఎదగాలని ఆకాంక్షించారు.

నేడు 'చలో గన్‌పార్క్'

నిర్మల్‌చైన్‌గేట్: ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మంగళవారం తలపెట్టిన చలో గన్‌పార్క్‌కు తరలిరావాలని ఉమ్మడి జిల్లా ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు కొట్టె శేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామ కిరణ్‌రెడ్డి కోరారు. మధ్యాహ్నం ఒంటిగంటకు నిర్వహించే ఉద్యమకారుల మహాధర్నాకు ఉమ్మడి జిల్లా ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారుల గుర్తింపునకు కమిషన్ ఏర్పాటు, ప్రతీ ఉద్యమకారునికి 250 చదరపు గజాల స్థలం, జార్ఖండ్ తరహాలో రూ.25 వేల పెన్షన్, బస్సు ప్రయాణ రాయితీ కల్పించాలని ప్రధా న డిమాండ్లతో ధర్న తలపెట్టినట్లు వివరించారు. ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు పార్టీలకు అతీతంగా హాజరై విజయవంతం చేయాలన్నారు.

ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లు

మామడ: మండల కేంద్రంలోని కేజీబీవీ ఇంటర్ ఫస్టియర్ సీఈసీ విభాగంలో చేరే విద్యార్థుల కోసం స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నట్లు ప్రత్యేక అధికారి జ్యోతి తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు కేజీబీవీలో సంప్రదించాలని సూచించారు. సీఈసీ విభాగంలో 15 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

హెచ్-82 యూనియన్ కార్యవర్గం



విద్యుత్ ఉద్యోగుల హెచ్-82 కార్యవర్గ సభ్యులు

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవనంలో తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల హెచ్–82 యూనియన్ జిల్లా సర్వసభ్య స మావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా లింగన్న, ప్రధాన కార్యదర్శిగా నిరంజన్, నిర్మల్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనివాస్, రాజేశ్వర్‌ను, భైంసా డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా శివాజీ, కరుణాకర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు షెకావత్‌పాషా, ప్రధాన కార్యదర్శి సాయిలు, శ్రీకాంత్, రాము తదితర పాల్గొన్నారు.